

వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు




దేవనగర్‌లోని శివాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కల్యాణ మూర్తులుగా శివపార్వతులు



లలితా పీఠంలో దీపాలు వెలిగిస్తున్న యువతులు



కార్తీక దీపాల వెలుగులో ముక్కంటి చిత్రం

దీప దర్శనం..సర్వపాప హరణం

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని నగరంలోని శైవాలయాల్లో సోమవారం విశేష పూజలు జరిగాయి. మహిళలు ఆలయాలను సందర్శించి కార్తీక దీపాలను వెలిగించి ఆకాశ దీప దర్శనం చేసుకున్నారు. కార్తీక వన భోజన కార్యక్రమాలు నిర్వహించారు. బిర్లా కాంపౌండ్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో లలితా పీఠం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం జరిగింది. కర్నూలు నగరంలోని సప్తగిరి కైలాస గిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్ శివాలయాలు, బుధవార పేట ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● శ్రీ సాయినాథ్ పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. యోగా కేంద్రం సభ్యులు ఢమరుకం, ఓంకారం, స్వస్తిక్, ద్వాదశ జ్యోతిర్లింగాల రూపాలను ఏర్పాటు చేసి దీపాలను వెలిగించి పూజలు చేశారు.



కార్తీక దీపం వెలిగించి పూజ చేస్తున్న మహిళ

క్లుప్తంగా

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతిపై బదిలీ

కర్నూలు (లీగల్): జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతిపై బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్‌ను వైఎస్ఆర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేసి, ఆస్థానంలో కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్నదేవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్నూలు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న పఠాన్ సియాజ్‌ఖాన్‌ను విశాఖ జిల్లా నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేసి ఆ స్థానంలో కర్నూలు మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ వందనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆదోని జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రమణారెడ్డిని గుంటూరుకు బదిలీచేసి ఆస్థానంలో ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఎముకల్లో సాంద్రత లోపిస్తే ఆస్టియోపోరోసిస్



బీఎండీ పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఎముకల్లో సాంద్రత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సి. వాసురెడ్డి చెప్పారు. సోమవారం వీఆర్ హాస్పిటల్‌లో ఉచిత బోన్ మినరల్ డెన్సిసిటి (ఎంబీడీ) పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసురెడ్డి ఎముకల్లో సాంద్రత లోపిస్తే ఆస్టియోపోరోసిస్ వ్యాధి వస్తుందన్నారు. దీనివల్ల ఎముకలు చిన్న ప్రమాదానికే విరిగే అవకాశం ఉందన్నారు. శిబిరానికి వచ్చిన 150 మందికి పరీక్ష చేయగా అందులో వంద మందికి ఎముకల్లో సాంద్రత తక్కువగా ఉందన్నారు.

పెద్దాసుపత్రికి బెంచీల వితరణ



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు పత్రాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బెంచీలు వితరణ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డికి క్లబ్ సభ్యులు అందజేశారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాల వద్ద రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్లబ్ ఆధ్వర్యంలో బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కర్నూలు ఫోర్ట్ అధ్యక్షుడు దామెర ప్రభాకర్, సభ్యులు వెంకటేశ్వర్లు, రామరాజు, రమణగౌడ్, పీవీ రాజ్‌కుమార్, చిన్నారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

యాదవుల అహిర్‌రెజ్మెంట్‌ను ఏర్పాటు చేయాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): 1962 నవంబర్ 18వ తేదీన చైనా దురాక్రమణను తిప్పికొట్టే ప్రయత్నంలో హిమాచల్ శిఖరంపై వీరోచితంగా పోరాడి ప్రాణాలు వదిలిన యాదవ సైనికులకు గుర్తుగా అహిర్ రెజ్మెంట్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ జోన్ కన్వీనర్ శేషఫణి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఎస్.మౌర్యను కలసి ప్రభుత్వం పరంగా అహిర్ రెజ్మెంట్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చైనా దురాక్రమణ సమయంలో 120 మంది యాదవ సైనికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి త్యాగానికి గుర్తుగా హిమాలయాల్లో అహిర్‌రెజ్మెంట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కూడా వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సింధు నాగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : టైగర్ 3, మంగళవారం ,కీడాకోలా, సప్తసాగరాలు దాటి, జిగర్‌తాండా డబుల్ ఎక్స్, స్పార్క్ లైఫ్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : టైగర్ 3, భగవంత్ కేసరి, మంగళవారం, జిగర్‌తాండా డబుల్ ఎక్స్, జపాన్, మాఊరి పొలిమేర 2, స్పార్క్ లైఫ్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: టైగర్3, మంగళవారం మా ఊరి పొలిమేర 2
ఐనాక్స్ : టైగర్ 3, సప్త సాగరాలు దాటి, మంగళవారం
భరత్ కాంప్లెక్స్ : ఓటు (చాలా విలువైనది)
శ్రీరామ : మంగళవారం
రాజ్ : సప్త సాగరాలు దాటి
విజయ : అన్వేషి

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



కమిషనర్‌కు వినతులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయ కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల ప్రజలు స్థానిక సమస్యలపై కమిషనర్‌కు వినతులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డీఈఈ రవిప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజా వినతుల్లో కొన్ని..

● మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని విఠల్ నగర్‌కు చెందిన కాశీం సాహెబ్, ప్రకాష్‌నగర్‌కు చెందిన అమ్జాద్ ఖాన్ వేర్వేరుగా వినతులు అందజేశారు.
● మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఇందిరమ్మ గృహాలకు చెందిన రాజ్‌కుమార్ అభ్యర్థించారు.
● టిడ్కో ఇల్లు కేటాయించాలని నాగజ్యోతి అనే మహిళ కమిషనర్‌కు విన్నవించారు.
● తమ కాలనీలో మంచినీటి కనెక్షన్లు, వీధి లైట్లు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని పెద్దపాడు శ్రీరామ రెసిడెన్సీలో నివసించే అంజనేయులు అభ్యర్థించారు.
● విఠల్‌నగర్‌లో తాగునీటి పైపులైన్ పగిలిపోయిందని, మరమ్మతులు చేయాలని అదే కాలనీకి చెందిన రమణ కోరారు.
● లక్ష్మీపురం మయూరి గ్రీన్ ల్యాండ్స్ వద్ద మురుగునీటి, రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని అదే కాలనీకి చెందిన హుసేనప్ప అభ్యర్థించారు.

వివాహాది శుభకార్యాల్లో రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న సురేష్‌కుమార్, ఆయన కుమారుడిని అభినందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ తమ వివాహాది శుభకార్యాల్లో రక్తదానం చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి. సురేష్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన తన కుమారుడు జయంత్ పుట్టినరోజు సందర్భంగా కుమారుడితో కలిసి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని రక్తనిధిలో రక్తదానం చేశారు. గత రెండు సంవత్సరాలుగా కుమారుడికి అలవాటు మార్చడం కోసం క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ప్రజలు వారి పిల్లల పుట్టిన రోజు, పెళ్లిరోజుల్లో రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, ట్రెజరర్ హైదర్‌బాషా, డ్వామా సూపరింటెండెంట్ ప్రతాప్ పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

కర్నూలు(సెంట్రల్): బీడీ కార్మికుల కోసం సుర్జీత్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వైదుడు కిషోర్ హాజరై బీడీ కార్మికులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి. ఇక్బాల్ హుసేన్, అబ్దుల్ దేశాయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలోకి జిల్లా వాసులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ మహిళా సమైక్య రాష్ట్ర కమిటీలో జిల్లా మహిళలకు చోటు లభించింది. ఇటీవల నంద్యాలలో జరిగిన ఏపీ మహిళా సమైక్య 17వ రాష్ట్ర మహాసభల్లో జిల్లాకు చెందిన పి.శ్రావణిరెడ్డిని రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలుగా నియమించారు.అలాగే రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా బి.గిడ్డమ్మను ఎన్నుకున్నారు. ఈనేపథ్యంలో వారిని సోమవారం సీపీఐ కార్యాలయంలో సన్మానించారు.

ఎస్సీ, ఎస్టీలకు స్పందన ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): దళితుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం జేసీకి వినతిపత్రం అందజేసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ..గతంలో ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేవారన్నారు. అయితే కోవిడ్ కారణంగా రద్దు చేయడంతో తిరిగి నిర్వహించడం లేదన్నారు.

కేవీఆర్‌లో ఎయిడ్స్‌పై అవగాహన

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, రెడ్‌రిబ్బన్ క్లబ్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ డా.జి. సీతమ్మ, ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపాలి

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని, ఆపార్టీని వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం సుందరయ్య భవన్‌లో కర్నూలు న్యూసిటీ కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏపీకి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు పి.నిర్మల, టి.రాముడు, సుధాకరప్ప, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

జి.పుల్లయ్య కాలేజీకి అవార్డులు

కర్నూలు సిటీ: జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీకి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ఎడ్యుస్కిల్స్ అవార్డులు దక్కాయి. ఈ నెల 17 నుంచి 19వ తేది వరకు మూడు రోజుల పాటు గోవాలో అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డా.ప్రమోద్ సావంత్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో తమ కాలేజీకి 19 అవార్డులు దక్కినట్లు కాలేజీ చైర్మెన్ జి.వి.ఎం. మోహన్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు కోరారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కర్నూలు అర్బన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ వెంకట లక్ష్మమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు పి. నిర్మల, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి లలిత తదితరులు ఉన్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న వడ్డే పద్మావతిని లైంగిక వేధింపులకు గురి చేసి ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ నిర్వాహకులు రవితేజ, ఫిరోజుఖాన్‌లపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏజెన్సీ నిర్వాహకుల వేధింపులు తాళలేక సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మారేళ్ల విజయ్ పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ గార్డు వడ్డే పద్మావతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని శిక్షించాలని ప్రజాపరిరక్షణ సమితి నాయకులు కె. బలరామ్, డేవిడ్, పురుషోత్తమ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ సూపర్‌వైజర్‌లైన రవితేజ, ఫిరోజ్‌ఖాన్ల వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిందన్నారు.

పేద ప్రజల జీవితాల్లో వెలుగులు

● గత ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాలను పావుల్లా వాడుకున్నాయి
● వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక 4వ వార్డు 11 సచివాలయం బండి మెట్ట వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బడుగు, బలహీనవర్గాలను ఓట్ల కోసమే వాడుకునేవని చెప్పారు. ఎన్నికల ముందు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి.. ఆ తరువాత అమలు చేయకుండా విస్మరించాయన్నారు. 2014లో టీడీపీ అధినేత చంద్రబాబు రుణమాఫీ పేరుతో రైతులను, పొదుపు మహిళను తీవ్రంగా మోసం చేశారన్నారు.అలాంటి నేతల మాయమాటలను నమ్మరాదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, చెప్పిన ప్రతి హామీని అమలు చేసి చూపిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని చెప్పారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు బదిలీ చేయడం జరిగిందన్నారు. అనంతరం కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలని తపించే సీఎం జగన్ అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్షియా పర్విన్, నాయకులు రియాజ్‌బాబా, మహబుబ్‌సా, ఎజాజ్, ఆరీఫ్, ఇలియాస్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌సీయూ తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పోషకాహార పునరావాస కేంద్రాన్ని(ఎన్ఆర్‌సీ), స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయు)ను సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. తీవ్ర పోషకాహార లోపం, మాధ్యమిక పోషకాహార లోపం ఉన్న పిల్లల గురించి ఆరా తీశారు. అక్కడ ఉన్న తల్లులతో పిల్లలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి చర్చించారు. ఏఎన్ఎంలు, ఆశాలు కలిసి ఈ వారం రోజులు వారి పరిధిలోని నవజాత శిశువులందరి జాబితా తయారు చేసి వారందరినీ సందర్శించాలని, వారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఆసుపత్రికి రెఫర్ చేయాలని సూచించారు.

ఐక్యపోరాటాలతోనే డిమాండ్ల సాధన

కర్నూలు(న్యూటౌన్): ఐక్యపోరాటాలతో న్యాయమైన డిమాండ్లను సాధించుకుందామని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి. వరప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం భూపాల్ రెసిడెన్సీలో ఆ అసోసియేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సర్కిల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సెక్రటరీ కేఎస్ కోటేశ్వర్‌రావు, ఏసీఎస్ రామదాసు, జిల్లా సెక్రటరీ జేవీ రమణ, జిల్లా నాయకులు ఎల్లయ్య, రామాంజనేయులు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌కు మొట్టికాయ

కర్నూలు (లీగల్): గ్రూప్–2 పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ ఇస్తామని ఫీజు తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించిన నెల్లూరు పట్టణానికి చెందిన మైండ్స్ ఐఏఎస్ అకాడమీపై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిర్యాదు దారుడి నుంచి తీసుకున్న ఫీజు రూ.12,300 తిరిగి ఇవ్వడంతో పాటు మానసిక వేదనకు గురి చేసినందుకు, కోర్టు ఖర్చులకు కలిపి రూ.50 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ సోమవారం ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే... కర్నూలు సమీపంలోని గార్గేయపురానికి చెందిన బెస్త మహేష్ గ్రూప్–2 పరీక్షల కోచింగ్ కోసం ఈ ఏడాది జనవరి 14న మైండ్స్ అకాడమీ నిర్వాహకులను సంప్రదించారు. పరీక్ష సిలబస్‌ను నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని, వీటికి సంబంధించిన వీడియో లెక్చర్స్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. అయితే ఆరు నెలలు గడచినా సిలబస్ పూర్తి చేయకపోగా, వీడియో లెక్చర్స్‌ను కూడా అందుబాటులో ఉంచలేదు. సిలబస్ పూర్తి చేయాలని కోరినా స్పందించలేదు. దీంతో చెల్లించిన ఫీజు వాపసు ఇవ్వాలని ఫిర్యాదుదారు కోరగా సదరు కోచింగ్ సెంటర్ పట్టించుకోలేదు. దీంతో ఆగస్టులో కమిషన్‌ను ఆశ్రయించి సొంతంగా తన కేసును తానే దాఖలు చేసుకుని వాదనలు వినిపించారు. విచారణ జరిపిన వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కోచింగ్ సెంటర్ తీరును తప్పుపట్టి ఫీజుతో పాటు రూ.50 వేలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

డీఈఓను సస్పెండ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) రంగారెడ్డిని విధుల నుంచి తప్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎంతో మంది ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మునిగి తేలుతున్నా వారిపై డీఈఓ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మరోవైపు కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలకు డుమ్మా కొట్టి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో బోధన చేస్తూ అక్రమ సంపాదన చేస్తున్నా జిల్లా విద్యాశాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆయా సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

గొందిపర్లలో వార్డు మెంబర్ ఆత్మహత్య

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలోని వార్డు మెంబర్ తిమ్మప్ప నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగాడు. ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు. వెంకటేశ్వర్లు కుమారుడు తిమ్మప్ప గ్రామానికి సమీపంలోని ఓ కంపెనీలో కాంట్రాక్ట్ పనులు చేయిస్తూ అదే గ్రామ పంచాయతీలో 12 వార్డుకు సభ్యుడి ఎన్నికైయ్యాడు. కాగా కుటుంబ కలహాలతో గ్రామానికి సమీపంలోని ఓ దర్గా వద్ద పురుగుల మందు తాగి తనకు కావాల్సిన వారికి ఫోన్ చేసి ఇక నేను ఉండను నా కొడుకులను, భార్యను బాగా చూసుకోండని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన వారు వెతకగా, దర్గా దగ్గర పురుగుల మందు డబ్బాతో కనిపించాడు. వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. తిమ్మప్పకు ఇద్దరు కుమారులు, భార్య సువర్ణ ఉన్నారు.

కేసీలో మరో విద్యార్థి మృతదేహం లభ్యం

కర్నూలు : కర్నూలు వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువలో గల్లంతైన మాలసాయి చరణ్ (14) మృతదేహం బయటపడింది. జొహరాపురం సమీపంలో కేసీ కెనాల్‌లో నీటిలో తేలియాడుతుండగా మృతుని తండ్రి తిమ్మప్ప గుర్తించి మూడవ పట్టణ పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. బుధవారపేటకు చెందిన సూరిబాబు, దానమ్మ కుమారుడు రామపోగు పవన్‌కుమార్, సాయిచరణ్ ఈనెల 17వ తేదీన స్కూల్‌కు వెళ్లకుండా బయటకు వెళ్లారు. వినాయకగుడి సామిరెడ్డి నగర్‌కు వెళ్లే రస్తాలో పార్కు వద్ద ఆడుకుంటూ కేసీ కెనాల్‌లో ఈత కొట్టేందుకు దిగారు. కెనాల్‌లో నీటి ప్రవాహానికి వారు కొట్టుకుపోయారు. పవన్‌కుమార్ మృతదేహం శనివారం బయటపడగా సాయిచరణ్ మృతదేహం సోమవారం బయటపడినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం స్థానిక నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. సాయీశ్వరాలయంలో స్వామి వారికి అభిషేకం, లక్ష బిల్వార్చన, సప్త హారతులు కార్యక్రమాలు చేశారు. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద, డాక్టర్ వసుంధరా సంజీవ్‌కుమార్ పూజల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

నగర శివారులో గోపూజ


కర్నూలు కల్చరల్: గోష్టాష్టమి సందర్భంగా నగర శివారులోని విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం స్థానిక జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గో పూజ, ఉసిరిక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణ, వన యాత్ర, మొక్కల పెంపకం, చెట్ల రక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామూహిక వన భోజనాలు నిర్వహించి విద్యార్థులకు వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వ్యాసరాజ్, చంద్రమోహన్, రామిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సోమయ్య, మురళి, శివారెడ్డి, వంశీ రాఘవ, హిమాయత్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

ఫుట్‌బాల్ పోటీలకు రిడ్జ్ విద్యార్థినులు

కర్నూలు (టౌన్) : నగర శివారులోని లక్ష్మీపురం వద్ద ఉన్న రిడ్జ్ పాఠశాలకు చెందిన రోహిణి, నికిత అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికయిన విద్యార్థినులను పాఠశాల సీఈఓ గోపీనాథ్ పాఠశాల ప్రాంగణంలో అభినందించి మాట్లాడారు. ఈనెల 21 నుంచి 23 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



గౌరవ వందనం స్వీకరిసున్తన్న అతిథులు



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న కర్నూలు జట్టు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–17 రగ్బీ బాలబాలికల పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన క్రీడా జట్లను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పరిశీలకులు నాగలింగేశ్వరరావు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వచ్చే నెలలో ఆడుదాం ఆంధ్రా పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ రగ్బీ పోటీలు లీగ్–కమ్–నాకౌట్ పద్ధతిన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మాంటిస్సోరి చిన్నారులు ప్రదర్శించిన స్వాగత నృత్యం అలరించింది. కార్యక్రమంలో పీఈటీల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆదర్శ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుదర్శనరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.